


కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి



- ఈనెల 15లోపు గ్రామ, మండల, బ్లాక్ స్థాయి అధ్యక్షుల నియామకానికి కసరత్తు
- జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు
- కుల సామాజిక వర్గాలుగా సమీకరణాలు
- నేడు బోధన్, నిజామాబాద్‌లలో పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సమావేశం

నిజామాబాద్ అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండటంతో అంతకుముందే పార్టీ గ్రామ, మండల, బ్లాక్ స్థాయి అధ్యక్షులతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కాంగ్రెస్ కమిటీల నియామకం కోసం పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ నియామకం కాగా పార్లమెంట్ ఇన్‌చార్జిగా, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, రాజీవ్‌రెడ్డి, నరేష్ జాదవ్‌లను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఇప్పటికే టీపీసీసీ ప్రధాన కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులను పార్టీ నియమించింది. జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులకు టీపీసీసీ కార్యవర్గంలో స్థానం కల్పించారు. ఇంకా టీపీసీసీ పూర్తిస్థాయి కార్యవర్గం నియమించలేదు. ఈనెల 15లోగా గ్రామ, మండల, బ్లాక్ స్థాయి అధ్యక్షులతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కాంగ్రెస్ కమిటీల పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జిగా నియమితులైన అజ్మతుల్లా హుస్సేనీ గురువారం బోధన్ నియోజకవర్గంతో పాటు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు తీసుకొని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేయనున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా కావడంతో పాటు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతల అభిప్రాయాలు తీసుకొని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. స్థానిక ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయడంలో భాగంగా ఎన్నికల షెడ్యూల్‌కు ముందే గ్రామస్థాయి నుంచి పార్టీ నాయకులకు పదవులను కేటాయించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సమాయత్తం అవుతుంది.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి కోసం పోటా పోటీ..

అధికార కాంగ్రెస్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం పోటా పోటీ నెలకొంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జిల్లా కావడంతో పార్టీ సైతం సీనియర్ నాయకుడికి పార్టీ పగ్గాలు అప్పగించేందుకు పూర్తిస్థాయి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందరిని కలుపుకొని వెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనే నాయకుడి కోసం పార్టీ నాయకత్వం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో స్థానం దక్కని వారికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి అప్పగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు సమావేశమై సమాలోచనలు చేసినట్లు తెలుస్తుంది. అధికారంలో ఉండటంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ప్రాముఖ్యత ఉండటంతో పలువురు నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లాకు చెందిన ముఖ్య నేతలను కలుస్తూ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు సమాచారం. ఈ నెల 15లోగా జిల్లా కాంగ్రెస్ కార్యవర్గంతో పాటు అధ్యక్షుడి నియామకం చేయనున్న నేపథ్యంలో సీనియర్ నేతలు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

సామాజిక వర్గాల వారీగా సమీకరణాలు..

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఏ సామాజిక వర్గానికి ఇవ్వాలనే విషయంలో పార్టీ అధిష్ఠానం సుదీర్ఘంగా జిల్లా సీనియర్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గానికి లేదా బీసీ సామాజిక వర్గానికి ఈ సారి జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తుండగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్ ఉండటంతో ఈసారి జిల్లా అధ్యక్ష పదవి ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారోనన్న ఆసక్తి నెలకొంది. రెడ్డి సామాజిక వర్గానికి సంబంధిత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ మారచంద్రమోహన్‌లు రేసులో ఉండగా బీసీ సామాజిక వర్గానికి సంబంధించి బాడ్సి శేఖర్‌గౌడ్, నగరానికి చెందిన నరాల రత్నాకర్, వేణుగోపాల్ యాదవ్‌లు రేసులో ఉన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవితో సరిసమానంగా ప్రాధాన్యత ఉన్న నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సైతం పలువురు పోటీ పడుతున్నారు. జిల్లా అధ్యక్ష పదవి రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి మున్నూరుకాపు సామాజిక వర్గానికి కేటాయించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, బొబ్బిలి రామకృష్ణ, రామర్తి గోపి, తదితరులు నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. సమీకరణాల వారీగా పార్టీ నాయకత్వం పార్టీని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర్థవంతంగా నడిపించే నాయకుల వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

లక్ష్యాల సాధనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ లక్ష్యాల సాధనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, భూసేకరణ, భూభారతి తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వైద్యాధికారులు, హౌజింగ్ ఏఈలు, ఐకేపీ ఏపీఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షిస్తూ అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను కేటగిరిల వారిగా విభజిస్తూ సత్వరమే వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 14 నాటికి అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. కాగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన సూచనల దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో ముందస్తుగానే అప్రమత్తతతో కూడిన చర్యలు తీసుకోవాలని ఇదివరకు అతివృష్టి సమయాల్లో తీసుకున్న చర్యలు సమీక్షించుకొని ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంట వెంటనే పరిశీలన జరుపుతూ అర్హులకు మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా వారికి ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని ఈ సందర్భంగా అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజోపయోగ పనుల కోసం భూసేకరణ జరిపిన స్థలాలను ఆయా నిర్మాణాల నిమిత్తం సంబంధిత శాఖలకు అప్పగిస్తూ పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందూరు శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి సర్దార్ వల్లభభాయి పేటేల్ చౌరస్తా వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చౌక్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ నేషనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ చింతకాయల ఝాన్సీ పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ప్రపంచంలో నెంబర్ వన్ స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా ఎదగడం జరిగిందన్నారు. విద్యార్థుల గొంతుకగా ఏబీవీపీ నిలుస్తుందన్నారు. దాదాపు 40 మంది కార్యకర్తలను పోగొట్టుకున్న ఏమాత్రం వెనకడుగు వేయకుండా అమరుల ఆశయాల సాధన కోసం ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. విద్యార్థిలోకం ఏబీవీపీలో చేరి దేశసేవలో నిమగ్నం కావాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని, విశ్వవిద్యాలయాల్లో టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, వెంకటకృష్ణ, సునీల్, దుర్గాదాస్, శ్రీకాంత్, సందీప్, మహేష్, లక్కి, రంజిత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘ నాయకులు

వ్యాధుల కాలం.. జర భద్రం

- అప్రమత్తతే శ్రీరామ రక్ష
- పరిసరాల పరిశుభ్రతను పాటించేలా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు
- అపరిశుభ్రత వల్ల దోమకాటుకు గురి కావాల్సిందే
- నీటి నిల్వలు లేకుండా చూసుకుంటునే దోమల నియంత్రణ

7

శిథిలావస్థలో పశు వైద్యశాల

- అత్యవసర సమయాల్లో ఇబ్బందులు
- వర్షం పడితే ఆరు బయటే పశువులు
- పట్టించుకోని అధికారులు

7

ప్రభుత్వ విద్య.. విద్యార్థి ప్రగతికి మెట్టు

- బలపడుతున్న ప్రభుత్వ పాఠశాల విద్య
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడులవైపు చూపు

కదం తొక్కిన కార్మికులు



- కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె
- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ధర్నా
- కార్మికుల హక్కులను పరిరక్షించాలని నినాదాలు
- నగరంలో కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

నిజామాబాద్ కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా కార్మికులు కదం తొక్కారు. దేశవ్యాప్తంగా ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం జిల్లాలో సమ్మె కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కార్మికుల హక్కులను హరించే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని కార్మిక సంఘ నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వం కార్మికుల పరిరక్షణకు పూర్తి బాధ్యత వహించాలని కార్మికుల హక్కులు కాలరాస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

సమ్మె విజయవంతం

జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో వివిధ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి తిలక్‌గార్డెన్ మీదుగా ధర్నా చౌక్ వరకు ర్యాలీ సాగింది. దారిపొడవునా కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులు నినాదాలు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ సాగింది. సార్వత్రిక సమ్మె ర్యాలీలో సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాములు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అనిల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్‌జహాన్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమయ్యలు వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 కోట్ల మందికి పైగా కార్మికుల వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం ఎన్ని విధాలుగా సమ్మెను ఆపడానికి ప్రయత్నించినా కార్మికులు ఐక్యతతో సమ్మెలో పాల్గొన్నారని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తుందని కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. అదాని, అంబాని, టాటాలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేలాగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించి నిరుద్యోగాన్ని పెంచుతున్నారని ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లు, సీట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల

మిగతా 8వ పేజీలో...



రోడ్డుపై బైఠాయించిన వివిధ సంఘాల కార్మికులు



మొక్క నాటుతున్న రూరల్ ఎమ్మెల్యే

నాటిన మొక్కను పెంచే బాధ్యత తీసుకోవాలి

- జిల్లాలో 51 లక్షల మొక్కలను నాటాలి
- వన మహోత్సవంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 51లక్షల మొక్కలను నాటి పెంచే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని తిర్మన్‌పల్లి రిజర్వ్ ఫారెస్టులో వన మహోత్సవం సందర్భంగా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భోగని ఖితతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో 51 లక్షల మొక్కలు నాటాల్సి ఉండగా ఇప్పటి వరకు 43లక్షల మొక్కలను నాటారని నాటిన మొక్కలను పెంచి పెద్దయ్యే వరకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. మంచి మనుగడకు చెట్లు ఎంతో అవసరం అని రాష్ట్రంలో 18 కోట్ల మొక్కలను నాటాలని సీఎం ఆదేశించారని అన్నారు. రాష్ట్రంలో 4కోట్ల జనాభా ఉందని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి రాష్ట్రాన్ని పచ్చదనంతో సశ్యశామలం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భోగని ఖిత, ఎఫ్‌డీవో సుధాకర్‌రావు, ఆర్‌డీవో రాజేంద్రకుమార్, ఇందల్వాయి రేంజ్ అధికారి రవిమోహన్‌భట్, తహసీల్దార్ వెంకట్రావు, ఎంపీడీవో అనంత్‌రావు, కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభం

బోధన్‌రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందిస్తూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని మధుమలాంచ డిగ్రీ కళాశాలలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి లాంఛనంగా మొక్కలను నాటి జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 500 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మొక్కలు నాటాల్సిన అవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తిస్తూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడబడటంతో పాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయని, జీవకోటికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు లభిస్తుందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగానే కాకుండా మన అవసర రీత్యా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తూ సన్నబియ్యం పంపిణీ చేస్తుందని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ బడుల్లో చదివించాలని కోరారు. మహిళా సంక్షేమం సాధికారత కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పక్షం రోజుల్లోనే పూర్తి స్థాయిలో మొక్కలు నాటి సంపూర్ణ లక్ష్యం సాధించేలా ముందస్తుగానే ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేశామన్నారు. గత సంవత్సరం వన మహోత్సవం సందర్భంగా 43లక్షల మొక్కలు నాటగా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. వివిధ కారణాల వల్ల చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 51.11 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఈ లక్ష్య సాధన కోసం ముందుగానే నర్సరీలో మొక్కలను సిద్ధం చేసి అనువైన ప్రదేశాలలో గుంతలు తవ్వి మొక్కలు నాటేందుకు అధికారులు, సిబ్బంది అందరిని సన్నద్ధం చేశామని ఆయన వివరించారు. గత ఏడాది వన మహోత్సవం అమలులో లోటుపాట్లను గుర్తిస్తూ ఈ సారి అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. నాటిన ప్రతి మొక్క బతికేలా పకడ్బందీగా సంరక్షణ చర్యలు చేపడుతున్నామని దీని వల్ల ఉపాధి హామీ కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరుతాయన్నారు. అన్ని వర్గాల వారిని వన మహోత్సవంలో భాగస్వాములు చేస్తూ జిల్లాలో సంపూర్ణ లక్ష్యాన్ని సాధిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్‌డీవో సాయాగౌడ్, సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్ రెడ్డిలతో అధికారులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోధన్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్

సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడి చిత్రంలో కలెక్టర్

బోధన్‌రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి బోధన్ డివిజన్‌లోని ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, భూభారతి అమలు తీరుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా వ్యవహరించాలన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి ఐకేపీ, మెప్మా ద్వారా రుణాలు ఇప్పిస్తూ ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. ఇసుక రవాణాలో అక్రమాలకు తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. మీసేవ కేంద్రాలలో నిర్ణీత రుసుము కంటే ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి యూనిఫామ్‌ల పంపిణీ

బోధన్ మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందికి బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ చేతుల మీదుగా కొత్త యూనిఫామ్‌లను సిబ్బందికి పంపిణీ చేశారు. శానిటేషన్ కార్మికుల సేవలను గుర్తింపు కార్యక్రమంలో భాగంగా యూనిఫామ్‌లను పంపిణీ చేశామని వారు పేర్కొన్నారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నిఘా పెంచి నేరాల నివారణకు చర్యలు చేపట్టాలి'

కమ్మర్‌పల్లి, జూలై 9: (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిఘాపెంచి నేరాల నివారణ చర్యలు చేపట్టాలని, గ్రామాలో చట్టాలపై అవగాహన పెంచాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన ఆయన స్టేషన్ రికార్డులు, కేసుల వివరాల నమోదు రిజిస్టర్లను, నిత్యకార్యకలపాల నమోదు పరిశీలించారు. నేరాల నియంత్రణ విషయమై సిబ్బందికి తగు సూచనలు, మార్గదర్శకాలు చేశారు. అనంతరం స్టేషన్ పరిసరాలను ఏసీపీ పరిశీలించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆర్మూర్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో బుధవారం ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ సుర్బిర్యాల జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు కాశిరెడ్డి పెద్ద గంగారెడ్డి, గడ్డం నర్సారెడ్డి, తొర్తి గంగయ్య, సాగర్, సాయిరెడ్డి, సందీప్, మెట్టు రవి పాల్గొన్నారు.

ఇంటింటా సర్వేతో లబ్ధిదారులకు న్యాయం

ఏర్గట్ల, జులై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలతో ఇంటింటా సర్వేచేసి ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా చేస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ అన్నారు. కార్యక్రమంలో రేండ్ల రాజారెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, సున్నపు అంజయ్య, మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

పీఆర్సీ నివేదిక తెప్పించి అమలు చేయాలి

వేల్పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల వేతన సవరణకు సంబంధించి పీఆర్‌సీ కమిషన్ నివేదిక తెప్పించి అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కేజీబీవీ పచ్చలనడ్కుడ, కొత్తపల్లి, వాడి, మోతె, వేల్పూర్, వెంకటాపూర్, కుకునూర్, అంక్సాపూర్ తదితర పాఠశాలలను ఆయన సందర్శించి డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ విజయ్‌కుమార్, జిల్లా డీటీఎఫ్ ఉపాధ్యక్షులు దాసు, పెంటన్న, కార్యదర్శి మదర్, తది తరులున్నారు.

మండల అధికారుల సమీక్ష సమావేశంలో ఎంపీడీవో

కమ్మర్‌పల్లి, జూలై 9: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా ఆవాజ్ యోజన పథకంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులు సకాలంలో పూర్తిచేయాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజాశ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యలయంలో మండల ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో వదాశివ్, ఏపీవో విద్యానంద్, మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితర గ్రామస్థాయి అధికారులుపాల్గొన్నారు

మోర్తాడ్‌లో ఎస్సై రాముని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రామును స్థానిక కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గిర్మాజి గోపి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల అశోక్, కాంగ్రెస్ నాయకులు జక్కం అశోక్, భూపతి, కడపటి రాజేశ్వర్, గిర్మాజి గంగాధర్, గుర్రం అశోక్, జక్కం అశోక్ లు ఉన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

కమ్మర్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క పుట్టినరోజును కమ్మర్‌పల్లి మండల ఐకేపీ సిబ్బంది, గ్రామ మండల సమాఖ్య సభ్యులు ఆదర్శవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఐకేపీ ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏపీఎం కుంట గంగారెడ్డి ఆధ్వర్యంలో మండల ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీసీలు భాగ్యలక్ష్మీ, పిర్య, చౌట్‌పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కొమ్ముల రాజేందర్, కుంట ఆనంద్, రవిందర్ పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటుకు అధికారుల అంగీకారం

ఆర్మూర్ టౌన్ , జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ ప్రాంతంలో కబ్జాకు గురైన కెనాల్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఫ్రెంచ్‌కట్ చేయించింది. ఈ నేపథ్యంలో అదే మార్గంలో రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వీడీసీ సభ్యులు తహసీల్దార్ సత్యనారాయణతో విన్నవించగా మున్సిపల్ కమిషనర్ రాజుతో ఫోన్‌లో మాట్లాడి రైతుల కోరిక మేరకు తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కమిషనర్ తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అధికారులను కలిసిన వారిలో అల్లూరి పెద్ద భూమన్న, వెంకట్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, విద్యాసాగర్‌గౌడ్, ఇట్టెడి సంతోష్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, అభి షేక్, నరేష్‌గౌడ్‌లు ఉన్నారు.

'జిల్లా స్థాయి యూత్ కాంగ్రెస్ సమావేశానికి తరలిరండి'

రుద్రూరు,జూలై9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నితిన్ పటేల్, ఉపాధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేది శుక్రవారం రోజున బాన్సువాడలోని శ్రీనివాస గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షస్రక్ నిసార్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కోటగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన మేకల గంగారాం(27) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. మృతుడి అన్న లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హంగర్గలో ఉచిత వైద్య శిబిరం

కోటగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గలో బుధవారం స్టార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామస్థులకు సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో లోలశంకర్, వైద్యులు ఇర్ఫానోద్దీన్, అఖిల్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఉదయ్ భాస్కర్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రుణాలను వినియోగించుకోవాలి

కోటగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి ఐకేపీ ఏపీఎం బస్వంత్ రావు సూచించారు. మండలంలోని ఎత్తొండ, సుద్దులం, అడ్కాస్‌పల్లి, పోతంగల్ మండలంలోని కొల్లూర్‌తో పాటు పలు గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కోటగిరిలో సీనియర్ మహిళ సంఘం సభ్యురాలు రమణమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం సభ్యులు, ఐకేపీ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

కోటగిరి, జూలై9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాలలో తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థులు 40 మందికి బ్యాగులతో పాటు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, లంచ్‌బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు రమేష్, బీజేపీ మండల అధ్యక్షులు నవీన్, ప్రకాష్ పటేల్, విలాస్, జగదీష్, శ్యామ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

బోధన్‌రూరల్,జూలై9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమ విధానాలపై వ్యతిరేక అలంబిస్తుందని నిరసనగా చేపట్టిన బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైందని కార్మిక సంఘాల నాయకులు మల్లేష్, శంకర్ గౌడ్, వరదయ్య, చక్రపాణిలు అన్నారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా బ్యాంకులు సైతం సమ్మెలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో నాయకులు వరదయ్య, చక్రపాణి, దాల్‌మల్క పోశెట్టి, ఈర్షద్‌బీ, నాగమణి, మక్కయ్య, రెహానా బేగం, గంగామణిలతో కార్మిక సంఘాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.


సమ్మె సందర్భంగా ర్యాలీ దృశ్యం

నందిపేట్ : గ్రామ పం చాయతీ ఉద్యోగులు, కార్మికులు నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు, జిల్లా కార్యదర్శి అబ్దుల్ రంజిత్ గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు అంజన్న, దేవన్న, పద్మ, కారోబార్ ప్రశాంత్, గంగగౌడ్, భాస్కర్, నరేష్, పోశెటి పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఎల్లయ్య, సుధాకర్, బీడీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ, అర్వింద్, దేవన్న మాట్లాడారు.

మోర్తాడ్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని నిజామాబాద్, కామారెడ్డి మాస్ లైన్ జిల్లా నాయకులు డి. కిషన్, సత్తెమ్మ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై టీయూసీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుండి ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు సత్తెమ్మ, మండల నాయకులు దశరత్, మాజీద్, చిన్నక్క, గంగు, నాగమణి, రాజేశ్వర్, దుర్గయ్య, సువర్ణ, రవి, రాజు, గజానంద్, భాజన్న, పాల్గొన్నారు.

మెండోర :రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపి విధులను బహిష్కరించినట్లు జేఏసీ నాయకులు సతీష్, రఫీక్ దేవరాజ్ తెలిపారు. కార్యక్రమంలో మహిపాల్, గంగాధర్, హన్మంత్‌షిండే, శ్రీనివాస్, హేమలత, శృతి, శ్రీకాంత్, సురేష్, సందీప్, వినోద్, జగదీష్, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి గ్రామపంచాయితీ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయుసీ పిలుపు మేరకు గ్రాపంచాయితీ పారిశుద్య, పంచాయతీ కార్మికులు ఒకరోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయుసీ నాయకులు అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 చట్టాలను పునరుద్దరించాలని కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమండ్ చేశారు.

రుద్రూరు : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని నిరసిస్తూ బోధన్ పట్టణంలో బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సీఐటీయూ ఆధ్వర్యంలో రుద్రూర్ మండలం నుండి గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, బీడీ కార్మికులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఏరియా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ పాల్గొన్నారు.

కోటగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు గంగాధర్, రాజు, దత్తు, పారూఖ్, వీరేశం, రాజేశ్వరి, లింగం, లింగామణి, స్వప్న పాల్గొన్నారు.

వేల్పూర్ : వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూసీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన కార్మికులు ఒకరోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూసీ నాయకులు బానుచందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 చట్టాలను పునరుద్దరించాలని కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు భానుచందర్, బి. లత, మల్లేష్, అర్చన, రమ్య, భూలక్ష్మీ, లక్ష్మీ, మండల పాఠశాలల మధ్యాహ్న బోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ : దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న కార్మికులకు పని గంటలు తగ్గించి కనీస వేతనం రూ. 26వేలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భీమ్‌గల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బడాభీమ్‌గల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీయుసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, ఐఎఫ్‌టీయూ నాయకులు అల్తాప్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు, సీఐటీయూ నాయకులు షంషుద్దీన్, అంగన్‌వాడి నాయకులు యమున, జ్యోతి, ప్రమీలా, చంద్రకళ, భాగ్యలక్ష్మీ, మహేందర్, పోషన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ : ఆలూర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకే మూసివేశారు. వివిధ పనుల నిమిత్తం పరిసరా గ్రామాల ప్రజలు కార్యాలయానికి రాగా మూసివుండడంతో అవక్కాయ్యారు. కార్యాలయం తలుపులు మూసి ఉండడంతో నిరాశగా వెళ్లిపోయారు.

ఆర్మూర్ టౌన్ : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విదనాలను అవలంభిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థలను, పవర్ సెక్టార్‌లను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జాతీయస్థాయి సమ్మెకు రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు బుధవారం ఆర్మూర్ డివిజన్ ఇంజనీరింగ్ ఆఫీస్ ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరందర్ నాయక్, కన్వీనర్ సల్లా శ్రీనివాస్, డీఈ రాజేశ్వర్‌రావ్, ట్రాన్స్‌కో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.


పోచంపాడ్‌లో విధులు బహిష్కరించిన విద్యుత్ ఉద్యోగులు

ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తు కోసం ప్రతీఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆలూర్ మండలం దేగాంలో రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గీతచెట్లను నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గంగ పుత్ర సభ్యులకు గంగమ్మ ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి మంజూరైన రూ.10 లక్షలు ప్రొసి డింగ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ అంజిరెడ్డి, ఎంపీడీవో గంగాధర్, గౌడ సం ఘ సభ్యులురాజాగౌడ్, సందీప్‌గౌడ్, శ్రీని వాస్‌గౌడ్, కనకగౌడ్, సుదర్శన్‌గౌడ్, పాల్గొన్నారు. దేగాం గ్రామంలో గంగపుత్రుల కులదైవం గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేయించిన ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలకు జిల్లా మత్స్యకార సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బింగి పెంట య్య, బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి, ధన్యవాదాలు తెలిపారు.


దేగాంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సౌకర్యాల నిమిత్తం నిధులు మం జూరు చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు డి.లక్ష్మణ్, జీవీ ఆర్‌చారి, రాజ్‌కు మార్, డి.లక్ష్మణ్‌లు వినతిపత్రం అందజేశారు. అంకాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఉపాధ్యా యులు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని కలిసి పెర్కిట్ పాఠశాలలో విద్యార్థులకు నూతన గదుల నిర్మాణం, బాలురకు టాయిలెట్స్ నిర్మించాల్సి ఉందని ఇందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందిం చిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పాఠశాలలో మౌలిక వసతులు తనవంతు సౌకర్యం అందజేస్తానన్నారు.

బోధన్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్

- 47 ద్విచక్ర వాహనాలు, 5ఆటోలు సీజ్
- బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్,జూలై9(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో బుధవారం సాయంత్రం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లల్లో సోదాలు నిర్వహించగా 47 ద్విచక్ర వాహనాలతో 5ఆటోలు సీజ్ చేయడం జరిగిందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు శక్కర్‌నగర్‌లో ప్రతి ఇంటిని తనిఖీ చేశామని, ఎలాంటి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె ఇళ్లల్లో ఉన్న వారి ఆధార్ కార్డులను పరిశీలించామన్నారు. ఇళ్లలో ఉన్న వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. అక్రమ కార్యకలాపాలకు కళ్లెం వేసేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మైనర్‌లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూరు సీఐ, పట్టణ ఎస్ఐలతో పాటు రూరల్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన కేంద్ర బృందం

జక్రాన్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రపోషణ అభియాన్ పథకం కింద మండలంలోని మునిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్రబృందం అధికారులు సందర్శించారు. బుధవారం మునిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేం ద్రాల్లో కేంద్ర బృందం అధికారులు, కేంద్ర పోషణ అభియాన్ కో-ఆర్డినేటర్ శ్రీసుప్రతిం, బట్టాచార్య రాష్ట్ర పరిశీలకుడు మర్విన్ పరిశీలించారు. కేంద్ర పోషణ అభియాన్ పథకం కింద రాష్ట్రంలోనే జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి, ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామాలను ఎంపిక చేశారు. కేంద్ర బృందం అధికారుల వెంట కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎం. చిన్న సాయిరెడ్డి, జిల్లా వెల్ఫేర్ అధికారిణి రసుల్‌బి, సీడీపీవోలు భార్గవి, జ్యోతి, సూపర్ వైజర్లు సునంద, రాంబాబు తదితతరులున్నారు


వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం అధికారులు

పల్లె దవాఖానాతో మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే

ముప్కాల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ఉండే ప్రజలకు మెరు గైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వ హయాం లో పల్లె దవఖానాలకు శ్రీకారం చుట్టారని మాజీమంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవఖానా, బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, బద్దం ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయ కులు సామ వెంకట్‌రెడ్డి, వెంకటేష్, ఎంఆర్‌వోలు శ్రీధర్, మోయినోద్దిన్, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లుపాల్గొన్నారు. మండల కేంద్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డికి కేజీబీవీ నూతన పాఠశాలను ప్రారంభించాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వినోద బుధవారం వినతిపత్రం అందజేశారు.


దవఖానా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మెండోర: గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మి కురాలు మీరాబాయితో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మాజీ మం త్రి ఎమ్మెల్యే వేమూరి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభిం చారు. బుధవారం మండ లంలోని సోన్‌పేట్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన నెహ్రూనగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను మాజీమంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించా రు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, మాజీఎంపీపీ సుకన్య కమలాకర్, మాజీ జడ్పీటీసీ తలారి గంగాధర్, నవీన్‌గౌడ్, మచ్చర్ల రాజారెడ్డి, గోలి ప్రకాష్, బాబా, దేవేందర్, అక్తర్, పాల్గొన్నారు. మండలంలోని సోన్‌పేట్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో తాజా మాజీ ఉపసర్పంచ్ చిన్నోళ్ల రమేష్, మాజీ ఎంపీటీసీ మాడుగుల నాగలక్ష్మీ, తోపారం హన్మాండ్లు రాకేష్, ముత్యం, సాగర్ తదితరులు న్నారు.

భీమ్‌గల్ రూరల్ : మండలంలోని సికింద్రా పూర్ పరిధిలోని పెద్దమ్మకాడి తండాలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ప్రారం భించారు.

ముప్కాల్ : ముప్కాల్ మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్‌ను మత్స్యకారుల సంఘ భవనం నుంచి ఖాళీ చేయమని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

హరితహారంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

ఎడపల్లి, జులై 9(ఆంధ్రజ్యోతి) : హరితహారంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ అన్నారు. ఎడపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామ శివారులో గల హనుమాన్ ఆలయ ఆవరణలో హరితహారంలో భాగంగా బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయన వెంట ఉపాధి హామీ ఏపీఎం శ్రీవాణి, ఈసీ శరత్, టెక్నికల్ అసిస్టెంట్ జ్యోతి, క్షేత్ర సహాయ కు రాలు సుచరిత, రైతులు కొప్పుల గంగాధర్, రాములు, మురళి ఉన్నారు.

రెంజల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ప్రభుత్వం నిర్వహించనున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రధాన కూడళ్ల వద్ద మొక్కలు నాటి స్కూల్ ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సీహెచ్ రాములు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల ఆవరణలో బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారు ఈ మొక్కలను నాటారు. కార్యక్రమంలో సందీప్, సాయి, అన్వేష్, దీపక్ తదితరులున్నారు.

రుద్రూరు : రాణంపల్లి క్యాంప్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ ఎండీ జలీల్ ఉద్దీన్ మాట్లాడుతూ రాణంపల్లి క్యాంప్‌లో సుమారు వెయ్యి ఈత మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాస్, ఆర్.దీపక్, గౌడ సంఘం నాయకులు డీ.వెంకాగౌడ్, సుదర్శన్ గౌడ్, గంగారాం పటేల్, గాండ్ల ఎర్రన్న పాల్గొన్నారు.

'రోడ్లను కాపాడుకోవాలి'

ఏర్గట్ల, జులై 9 (ఆంధ్రజ్యోతి): క్రేజ్‌వీల్ ట్రాక్టర్లను రోడ్లపై నడిపి రోడ్లను పాడు చేయవద్దని ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని ట్రాక్టర్‌ల యజమానులు, పలు రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మన రోడ్లను మనమే కాపాడుకోవాలని, కేజ్‌వీల్ ట్రాక్టర్లు రోడ్లపై ఎట్టి పరిస్థితుల్లో నడపొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో కరెంట్ షాక్‌తో గేదె మృతి

మోర్తాడ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎలాలవాడ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్‌తో పాడిగేదె మృతి చెందింది. స్థానిక కుర్మ మహేష్‌కు చెందిన పాడిగేదే మేత మేస్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ తీగ తగలడంతో మృతి చెందిందని బాదితుడు తెలిపారు. ఈ గేదె మృతివాల్ల లక్షల 50వేలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు సందర్శించి బాధితుడితో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి, జులై09(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో బుధవారం ఒకేషనల్ కోర్సులో భాగంగా విద్యార్థినులు వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గంగాశంకర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాల/కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన ఒకేషనల్ కోర్సులో భాగంగా విద్యార్థినులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ పాఠశాల ఆవరణలోని క్షేత్రంలో క్షేత్రస్థాయిలో విద్యార్థులతో వరినాట్లు వేయించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు. పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

రెంజల్,జూలై9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్ కుమార్, రవీందర్‌లు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య శాఖ అధికారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు కీటక జనిత వ్యాధులు, దోమల నివారణ, దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి ఆవరణలో ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై బీరు సీసాతో దాడి

నవీపేట,జూలై9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఎస్‌కే సాదక్ అలీ అనే యువకుడిపై బిల్లి రాకేష్ అనే యువకుడు బీరుసీసాతో దాడి చేసి గాయపర్చాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. స్థానిక బిల్లి నరేష్‌కు చెందిన మేకలను సాదక్ అలీ మేపేవాడని అన్నారు. మంగళవారం అభంగపట్నం శివారులో బిల్లి నరేష్ కుటుంబ సభ్యులు వన భోజనానికి వెళ్లగా సాదక్ అలీ సైతం వన భోజనానికి వెళ్లాడని అన్నారు. బిల్లి రాకేష్ మద్యం మత్తులో అకారణంగా సాదక్ అలీని దూషించి తలపై బీరు సీసాతో దాడి చేశాడని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేకల మందను నిలుపకుండా చూడాలని వినతి

నవీపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే మేకల సంత జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలల ఎదురుగా మేకల మందలను నిలుపకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాథోడ్ గోవింద్‌నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో నాగనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. మేకల సంత రోజున పాఠశాలల ఎదురుగా మేకల మందలను నిలిపిఉంచడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

మాంసం వ్యాపారులు పరిశుభ్రతను పాటించాలి

బోధన్‌రూరల్,జూలై9(ఆంధ్రజ్యోతి): మాంసం వ్యాపారులు తమ దుకాణ సముదాయాల్లో పరిశుభ్రతను పాటించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని మాంసం దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాంసం దుకాణదారులను ఆయన పర్యవేక్షించారు. ఆయన వెంట శానిటేషన్ ఇన్స్‌స్పెక్టర్ గణేష్, మున్సిపల్ జవాన్ గోపి, మున్సిపల్ సిబ్బంది న్నారు.

లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలి

జక్రాన్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఇస్తుందని ఎంపీడీవో సతీష్‌కుమార్ అన్నారు. ఇం దిర మహిళా శక్తి సంబురాల్లో భాగంగా బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మహి ళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై మహిళలకు సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నసాయిరెడ్డి, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి అనిల్, మహిళ సంఘాల కో-ఆర్డినేటర్ గంగాధర్ పాల్గొ న్నారు.

వేల్పూర్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిర మహిళా శక్తి సంబురాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు అధికారి సంధ్యారాణి, వేల్పూర్ మండల కేంద్రంలో బుధవారం మహిళాసంఘాల ప్రతినిధులతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆమె చర్చించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మాణిక్యం, సీసీలు రవి, మురళి, గ్రామ సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు

నవీపేట,జూలై9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అభంగపట్నంలో బుధవారం పలువురు గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఏర్గట్లలో శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల



పెచ్చులుడిపోయిన పైకప్పు

శిథిలావస్థలో పశు వైద్యశాల

● అత్యవసర సమాయాల్లో ఇబ్బందులు
● వర్షం పడితే ఆరు బయటే.. ● పట్టించుకోని అధికారులు

ఏర్గట్ల, జులై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఆరుగాలం కష్టపడి పండించే అన్నదాతకు అన్ని కాలాల్లో తోడుండేది పశు సంపద, పంట సాగులో నష్టాలొచ్చినా.. పూట గడిచేందుకు దుక్కులు దున్నేందుకు పశువుల రైతన్నను అక్కున చేర్చుకుంటాయి. అందుకే రైతు దాన్ని పశువుగా కాకుండా ఇంటి మనిషిలా చూసుకుంటాడు. దానికేమైనా విలవిల్లాడి పోతాడు. జబ్బు నయం అయ్యే వరకు తీవ్ర ఆందోళనకు గురవుతాడు. అలాంటిది పశువులకు వైద్యం చేయించాలంటే పశు వైద్యశాలకు వెళ్లాల్సిందే. అయితే మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాల ఏళ్ల క్రితంది కావడంతో పశువైద్యశాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఏర్గట్ల మండలకేంద్రం అయినప్పటికీ పశు వైద్యశాల నూతన భవనానికి కానీ మరమ్మతులకు గానీ నోచుకోవడం లేదు.

శిథిలావస్థలో పశు వైద్యశాల..

మండల కేంద్రంలోని పశు వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అన్ని గదులలో పూర్తిగా పైకప్పు పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయి దారుణంగా తయారయింది. దీంతో వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయి వైద్యులు ఆరు బయటే ఉంచి వైద్యం చేయాల్సిన పరిస్థితి. కనీసం వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. శిథిలావస్థలో ఉన్న భవనం స్థలంలో కొత్త భవనాలు నిర్మిస్తే ఇబ్బందులు కొంత వరకు తీరే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..
రాజ్యలక్ష్మీ, పశువైద్యాధికారిణి, ఏర్గట్ల

శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల నూతన భవన నిర్మాణం, మరమ్మతులు ఎలాంటి సమాచారం లేదు. శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల వివరాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.





నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది



అపరిశుభ్రత వాతావరణంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వ్యాధుల కాలం.. జర భద్రం

● అప్రమత్తతే శ్రీరామ రక్ష
● పరిసరాల పరిశుభ్రతను పాటించేలా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు
● అపరిశుభ్రత వల్ల దోమకాటుకు గురి కావాల్సిందే
● నీటి నిల్వలు లేకుండా చూసుకుంటునే దోమల నియంత్రణ

కామారెడ్డి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలమంటేనే వ్యాధుల కాలం. రోగులతో ఆస్పత్రులు కీటకిటలాడే సమయం. ఉన్నవి.. లేనివి అన్ని ఇప్పుడే విజృంభిస్తూ మనుషుల్ని అతలాకుతలం చేస్తుంటాయి. వాటిలో ప్రథమస్థానంలో ఉండేవి దోమకాటు రోగాలే. అందులో ప్రథమ స్థానంలో నిలిచేది మలేరియా వ్యాధి. ఈ వ్యాధి ఆడ ఎనాఫిలాస్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. కాలువలు, చెరువులు, కుంటలు, పంట కాలువలు పొలాల్లో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. ఇవి రాత్రి వేళ్లలో ఎక్కువగా కుడుతాయి. దోమ కుట్టినప్పుడు నొప్పి,దద్దుర్లు వంటివి ఏర్పడతాయి. ఈ దోమ ప్రభావం ఎర్ర రక్త కణాలపై ఉండడంతో దీంతో 10 నుంచి 14 రోజుల పాటు జ్వరం వస్తుంది. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు ఉండి చలి జ్వరంతో తీవ్రంగా వణుకు వస్తుంది. ఒక్కోసారి మెదడు, కిడ్నీ, కాలేయాలను దెబ్బతీసే ప్రమాదం కూడా ఉంటుంది. దీనికి తోడు జిల్లాలో డెంగ్యు కేసులు ఆయా చోట్ల నమోదవుతున్నాయి. కలుషిత నీరు, నీటి నిల్వలు సైతం ఎక్కువగా ఉండడంతో డయేరియా లాంటి వ్యాధులు త్వరగా సంక్రమిస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ చిన్నపాటి జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు ఉన్న వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచిస్తున్నారు. ఈ కాలంలో రోగాల వ్యాప్తి వాటికి గల కారణాలపై అవగాహనపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

దడ పుట్టించే డయేరియా

వర్షకాలంలో ఎక్కడ పడితే అక్కడ నీటి నిల్వలు ఉండడం ఈ నీరు తాగునీటి ప్రవాహాలలో కలవడంతో పాటు వాటిపై ఈగలు వాలి వ్యాధి కారకాలుగా మారుతాయి. ఇలా కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వ్యాప్తి చెందుతుంది. వర్షాకాలంలో ఎక్కువగా చిన్నపిల్లల్లో డయేరేయా దడపుట్టిస్తుంది. డయేరియా వస్తే వాంతులు,విరేచనాలు ఎక్కువగా అవుతూ కడుపు నొప్పి, దాహం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తాగునీటి పైపులైన్‌లు లీకేజీలు లేకుండా చూడాలి. భోజనానికి ముందు, మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.

పగటిపూట కుట్టే దోమతో చికున్ గున్యా

ఏడిస్ ఈజిప్ట్ అనే ఆడ దోమ కుట్టడం ద్వారా చికెన్ గున్యా వస్తుంది. ఈ దోమ ఎక్కువగా పగటి పూట మాత్రమే కుడుతుంది. ఒళ్లు నొప్పులు, తీవ్రమైన కీళ్ల నొప్పులుంటాయి. మంచం కూడా దిగి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరం తగ్గిన కూడా దాదాపు 45 రోజుల పాటు చేతులు కాళ్లలో తిమిర్లు,మంటలు, కీళ్లనొప్పులు ఉంటాయి. గత రెండు,మూడు నెలల నుంచి ఈ వ్యాధి భారిన పడి ప్రైవేట్ ఆసుపత్రులలో చాలామంది చికిత్సలు తీసుకున్నారు.

దోమ కుట్టిన వారానికి డెంగీ వ్యాప్తి

ఈడిస్ ఈజిప్ట్ అనే టైగర్ దోమ మూలంగా డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ కుట్టిన వారానికి డెంగీ లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువగా పగటిపూటే కుడతాయి. అపరిశుభ్రమైన నీటిలో వృద్ధి చెందుతాయి. మూతలు లేని నీళ్ల ట్యాంకులు,సిమెంట్,తారు రోడ్లపై నిలిచే నీటిలో,పూల కుండిల్లో, కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నిల్వ ఉండే నీటిలో దోమ పెరుగుతుంది. డెంగీకి గురైన వ్యక్తులు ఎముకల్లోనూ, కండరాల్లో నూ, భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రటి పొక్కులు వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జన, కడుపునొప్పి తదితర లక్షణాలు ఉంటాయి. బీపీ తగ్గడంతో పాటు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుతుంది. జిల్లాలో డెంగీ కేసులు నమోదు మొదలైంది. నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లిలో ఈ వ్యాధి భారిన ఒకరు పడగా ఆ ప్రాంతమంతా అధికారులు దోమల నియంత్రణపై అవగాహన చేపట్టారు.

పందులను కుట్టిన దోమ కుడితే మెదడు వాపు

పందులకు కుట్టిన క్యులెక్స్ దోమ మనుషలను కుడితే మెదడువాపు వ్యాప్తి వస్తుంది. ప్రధానంగా పిల్లలకు ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉంటుంది.ఈ వ్యాధి వల్ల తీవ్రమైన తలనొప్పి, మెదడు పొరల్లో వాపు ఉంటుంది. కొన్నిసార్లు కోమాలోకివెళ్లె ప్రమాదం ఉంటుంది. శరీరంలో వణుకు, ఏదైనా ఒక భాగం చచ్చుబడిపోయే ప్రమాదం ఉంటుంది.పై అన్ని వ్యాదులకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా కారణమయ్యేవి దోమలే.


వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- మోర్లిన్ల వద్ద వేసే చెత్తను, మురికి కాలువలలో నీరు ఆగకుండా చూసుకొవాలి.
- చిరుతిండ్లకు దూరంగా ఉండాలి.
- ఈగలు,దోమలు వాలిన పదార్థాలను తీసుకోకూడదు.
- తాగేనీటిని కాచి చల్లార్చిన తర్వాత తీసుకోవాలి.
- ప్రదానంగా దోమలు కుట్టకుండా చూసుకోవాలి.
- ఇంట్లోకి దోమలు రాకుండా కర్టెన్లు, కిటికీలు మూసుఉంచాలి.
- రాత్రి నిద్రించే సమయంలో దుప్పటి శరీరం నిండుగా కప్పుకోవాలి.

కొండెక్కిన కొబ్బరి ఉత్పత్తులు..
వినియోగదారులపై అధిక భారం



కొబ్బరి బొండాలు ఆటోలో తరలిస్తున్న దృశ్యం



కిరాణ దుకాణంలో విక్రయిస్తున్న ఎండు కొబ్బరి



కొబ్బరి కాయలు

పెద్దకొడప్‌గల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చాలా మంది భక్తులు ఉదయం లేవగానే స్నానాలు ఆచరించి, ఆ తరువాత మనస్సు ప్రశాంతత కోసం భక్తిగా దేవుని దర్శనం కోసం వివిధ ఆలయాలకు వెళ్తారు. ఆ సమయంలో దేవుడిని నైవేద్యంగా కొబ్బరికాయను సమర్పించుకుంటారు. అటువంటి కొబ్బరి కాయ నేడు కొండెక్కి కూర్చుంది. ఇక దీంతో పాటుగానే బలహీనంగా ఉన్న వారు తొందరగా కోలుకునేందుకు, వారి శరీరంలో నీటి శాతం పెరగడానికి కొబ్బరి బొండాలు తాగాలని వైద్యులు సూచిస్తారు. అటువంటి కొబ్బరి బోండా నేడు చెట్టెక్కి కూర్చుంది. దీంతో పాటుగానే ప్రతీ ఇంటిలో మహిళలు వంట గదిలో వివిధ రకాల నాన్‌వెజ్ వంటకాలు చేసే సందర్భంగా, ఇతర సమయాలలో కొబ్బరి కుడుకల పొడిని విని యోగిస్తారు, అటువంటి కొబ్బరి పొడి నేడు వంట గదిలోకి రావ డానికి భారంగా మారింది. ఇక వివిధ శుభకార్యాలలో ఓడి బియ్యం పోసే సమయంలో ఆనవాయితీగా కొబ్బరి కుడుకలను వినియోగి స్తారు. అటువంటి కొబ్బరి కుడుకలు ధర అమాంతంగా పెరిగి కిందికి దిగనని మారం చేస్తుంది. గతంలో సామాన్యుడికి అందు బాటులో ఉన్న కొబ్బరి ఉత్పత్తులు నేడు అమాంతంగా ధర పెరిగి సామాన్యుడిపై భారంగా మారింది. గతంలో రూ.15 నుంచి రూ.20లుగా ఉండే కొబ్బరి కాయ నేడు రూ.30లకు చేరింది. ఇక ఎండు కొబ్బరి గతంలో కిలో 160 రూపాయలుగా ఉండగా నేడు ఏకంగా రూపాయలు 2 వందలకు పైగా పెరిగి 4 వందలకు కిలోగా అయ్యింది. సామాన్యుడికి శక్తిని అందించే కొబ్బరి బొండాలు గతంలో రూ.30 ఉండగా నేడు ఒక్కటి రూ.50లకు పైగా అమ్ముతున్నారు. ఈ సంవత్సర కాలంలోనే కొబ్బరి ఉత్పత్తులకు సంబంధించిన వస్తువులపై ధరలు అధికంగా పెరగడం తో వినియోగదారు లకు భారంగా మారింది. దీంతో కొబ్బరి ఉత్పత్తులకు సంబంధించిన వస్తు వులు కొనాలంటే ప్రజలు జంకుతున్నారు.

ఇతర దేశాలకు ఎగుమతే ధరల పెరుగుదలకు కారణమా

తెలంగాణ రాష్ట్రం కొబ్బరి కాయలతో పాటు వాటి ఉత్పత్తులు కోసం ఆంధ్రప్రదేశ్ ఆధారపడి అక్కడి నుంచి దిగుమతులు చేసుకుంటుంది. కొన్నేళ్లుగా కొబ్బరికి సంబంధించి అన్ని వస్తువులు ఆంధ్ర నుంచే తెలంగాణకు వస్తున్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఆంధ్ర ప్రదేశ్ నుండి కొబ్బరి ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుండటంతో వాటి ధరలు అమాంతంగా పెరుగుతున్నట్లు వ్యాపారస్థులు చెబుతున్నారు. గతంలో ఆంధ్ర నుంచి తెలంగాణకు గాని ఇతర రాష్ట్రాలకు గాని కొబ్బరి కాయలను వందకు ఇంత ధర అని నిర్ణయించే అక్కడి వ్యాపారస్తులు నేడు కొబ్బరికాయలను కిలోకు రూ.30 నుంచి రూ.40లకు కిలో చొప్పున అమ్ముతున్నారని తెలంగాణ వ్యాపారస్థులు చెబుతున్నారు. దీంతో పాటుగానే ఆంధ్ర నుంచి తెలంగాణకు సరుకు తీసుకరావడం ట్రాన్స్‌పోర్ట్ కారణంగా కూడా ధరలు మరింత భారంగా మారాయని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. కొన్నినెలల కిందట కుంభమేళా సమయంలో ధరల పెరుగుదల ప్రారంభమై నేటి వరకు ధరలు తగ్గడం లేదని తెలంగాణ వ్యాపారస్తులు వాపోతున్నారు. దీంతో తమకు కొబ్బరి ఉత్పత్తులకు సంబందించి వ్యాపారం కాస్త కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీమాతో రైతన్నల కుటుంబాలకు ధీమా

● 2018 నుంచి రైతు బీమా పథకం అమలు ● ఇప్పటివరకు జిల్లాలో 8432 కుటుంబాలకు పరిహారం
● బాధిత కుటుంబాలకు రూ.441 కోట్లకు పైగా అందజేత



పొలంలో దుక్కిదున్నుతున్న రైతన్న



రైతు బీమా ప్రొసిడింగ్ కాపీ అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

పెద్ద కొడప్‌గల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్దగా ఉన్న వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబ బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. అందులో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని ఉన్న రైతు అనుకోకుండ మరణిస్తే ఆ బాధ ఇంకా తీవ్రంగా ఉంటుంది. దీనిని గుర్తించిన గత సర్కార్ రైతుల సంక్షేమం కోసం రైతు బీమా పథకం అమలు చేసింది. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం గత ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడ అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా బీమా ఉన్న రైతు మరణిస్తే ఆ కుటుంబంలోని నామినీకి 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకం కింద 18 సంవత్సరాల వయస్సు నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులు. గతంలోనే ఈ పథకం కింద ఉన్న రైతులకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఉచితంగా ప్రభుత్వమే బీమా చెల్లిస్తుంది. కొత్తగా భూమిని కొనుగోలు చేసే రైతుల కోసం ప్రభుత్వం ఆగస్టు నెలలో నమోదుకు అవకాశం కల్పిస్తారు. రైతు ఏ కారణంతో మరణించిన రైతు కుటుంబానికి పరిహారం అందజేయబడుతుంది. ఇందుకు సంబంధించి మరణించిన రైతు కుటుంబీకులు సంబందిత వ్యవసాయాధికారికి పత్రాలు అందజేస్తే వారు క్లెయిమ్ కోసం పంపుతారు. అనంతరం ఇన్స్‌రెన్స్ కంపెనీ నుంచి పరిహారం రైతుకు సంబందించిన నామినీ ఖాతాలో జమ చేస్తారు. గతంలో నామినీకి చెక్కులు అందజేసే పద్దతి ఉండగా, రాను రాను నామినికి కేవలం ప్రొసీడింగ్ మాత్రమే అందజేసి డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేస్తున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 8432 కుటుంబాలకు ఆసరా..

కామారెడ్డి జిల్లాలో 2018 నుంచి పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 8432 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. దీంతో సుమారుగా మరణించిన రైతు కుటుంబాల నామినీ ఖాతాల్లో సుమారుగా రూ.441 కోట్లకు పైగా జమయ్యాయి. 2018 సంవత్సరంలో 792 రైతులు మరణించగా 792 కుటుంబాలకు, 2019 సంవత్సరంలో 884 మంది రైతులు మరణించగా 883 మందికి, 2020 సంవత్సరంలో 1615 మంది రైతులు మరణించగా 1615 మందికి, 2021 సంవత్సరంలో 1339 రైతులు మరణించగా 1337 మందికి, 2022 సంవత్సరంలో 1373 మంది రైతులు మరణించగా 1371 మందికి, 2023లో 1400 మంది రైతులు మరణించగా 1386 మందికి, 2024 సంవత్సరంలో 1228 మంది రైతులు మరణించగా నేటి వరకు 1048 మందికి పరిహారం అందజేసినట్లు వ్యవసాయాదికారులు తెలిపారు.

పరిహారం చెల్లింపులో కాస్త ఆలస్యం..

పథకం ప్రారంభమైన తొలినాళ్లలో మరణించిన రైతులకు సం బంధించిన పత్రాలు ఏఈవోలకు అందజేయగానే వారు ఎల్ఐసి వారికి పంపేవారు. దీంతో సంబంధిత రైతు నామినీ ఖాతాలో తొందరగా డబ్బులు జమయ్యేవి. కొన్నేళ్లుగా ఆలస్యంగా డబ్బులు జమ అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

రూ.441 కోట్లకు పైగా జమ చేశాం..
తిరుమల ప్రసాద్ జిల్లా వ్యవసాయాధికారి



జిల్లాలో పథకం ప్రారంభం నాటి నుంచి నేటి వరకు మరణించిన 8432 రైతులకు సంబందించిన నామినీ ఖాతాల్లో రూ.441 కోట్లకు పైగా జమ చేశాం. గతంలో ఈ పథకం కింద ఉన్న రైతులకు ప్రభుత్వమే బీమా చెల్లిస్తుంది. ఇక కొత్తగా వ్యవసాయ భూమి కొన్న రైతులకు ఈ నెల చివరిలోగా లేదంటే ఆగస్టు నెలలో నమోదుకు అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత గ్రామాలకు ఏఈవోలకు అందజేస్తాం.

ప్రభుత్వ విద్య.. ప్రగతికి మెట్టు

● బలపడుతున్న ప్రభుత్వ విద్య
● ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడులపై చూపు

భీమ్‌గల్ జూలై 9 (ఆంధ్రజ్యోతి): రమేష్ మీ పిల్లల్ని ఎక్కడ చదివిస్తున్నారు అని అడిగితే కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు అనే రోజులు నాడు, కానీ ఇప్పుడు మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారు అంటే ప్రభుత్వ బడులలో చదువుతున్నారని రోజులు వచ్చాయి. దీనికి కారణం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రణాళికం సిద్ధం చేసై ఆ దిశగా ముందుకు వెళుతున్నాయి. ఇందులో భాగంగా పాఠశాలల్లో ఉచిత సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ముందు ఆదేశాను సారం మండల కేంద్రాలలో ఎంఈవో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులుకు ప్రతీ నెల వృత్యాంతర శిక్షణను ఏర్పాటు చేస్తూ నాణ్యమైన, నైపుణ్యత గల విద్య అందించేందుకు కృషి చేస్తున్నారు. అలాగే విద్య సంవత్సరం ప్రారం భానికి ముందు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతీ గడప గడపకు తిరుగుతూ ప్రభుత్వ విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులకు తెలియజేస్తూ పాఠశాలల్లో విద్యార్థులు చేర్పిస్తూ నాణ్యమైన విద్యను బోధి స్తున్నారు. ఇదేగాక ఆదర్శ పాఠశాలల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఉచిత విద్యను అందిస్తుంది. పట్టణ కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం బడిబాటలో భాగంగా ఆటోల ద్వారా ప్రచారం చేశారు.

ప్రభుత్వం వినూతన ప్రణాళిక ..

రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్యను బలోపేతం చేసేందుకు సంవత్సరం నుంచి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలను పాఠశాలలో ప్రవేశపెట్టారు. దీంట్లో భాగంగా మండలంలోని పల్లికొండ ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాథమిక విద్య నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివితే మంచి భవిష్యత్తు ఉందని ప్రైమరీ విద్యనుంచే ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రీ ప్రైమరీ బోధించేందుకు విద్య వాలంటీర్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం జీవో జారీ చేసింది.

ఆ పాఠశాలలు ఆదర్శం..

మండలంలోని పల్లికొండ, బెజ్జోరా ప్రభుత్వ పాఠశాలలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం బెజ్జోరలో 27 మంది పదవ తరగతి పరీక్షలు రాయగా అందులో అందరు ఉత్తీర్ణులు అయ్యారు. వీరిలో నుంచి 14 మంది విద్యార్థులకు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించింది. ఈ పాఠశాలలో చదువు చెప్పే ఉపాధ్యాయుల సైతం తమ పిల్లాల్ని ఇదే పాఠశాలలో చదువు చెప్పించడం గమనార్హం. అలాగే పల్లికొండ పాఠశాలలో చదివిన ఎందరో మంది విద్యార్థుల సైతం బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ఉన్నత చదువులు చదివి వివిధ రంగాలలో స్థిరపడ్డారు. ఇది గుర్తెరిగిన పక్క గ్రామాలైన పురాణిపేట్, బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల విద్యార్థులను సైతం పల్లికొండ ప్రభుత్వ పాఠశాలలో చేరారు.

క్రీడలపై ప్రత్యేక దృష్టి..

విద్యార్థులకు నాణ్యమైన చదువుతుతో పాటు క్రీడలలో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రతీ పాఠశాలకు పీఈటీ, పీడీలను కేటాయించడంతో విద్యార్థులకు క్రీడలపై నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో ఆటలాడుతున్న విద్యార్థులు

జిల్లాలోని ఆదర్శం..

మంలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రవేశాలు అధిక సంఖ్యలో చేరడంతో జిల్లాలో ఆదర్శంగా నిలుస్తుంది. ఈ విద్యా సంవత్సరం 900 పై చిలుకు నూతన చేరికలు (అడ్మిషన్లు) కావడంతో జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారితో పాటు ఉపాధ్యాయులను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలు బలోపేతం చేస్తున్నాం
- స్వామి, ఎంఈవో, భీమ్‌గల్



ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని పాఠశాలల బలోపేతానికి తీవ్రంగా కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయులకు నెలవారీ సమావేశాలు నిర్వహించి ప్రత్యేక శిక్షణను అందజేస్తున్నాం.

ప్రభుత్వ పాఠశాలలో చదివి మెడిసిన్ చేస్తున్నాను
- శివాణి, పల్లికొండ



మండలంలోని పల్లికొండ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి వరకు చదువకున్నాను. ఇంటర్మీడియట్ నిజామాబాద్‌లో చదివాను. 2022 సంవత్సరంలో సూర్యాపేటలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు లభిం చింది. ప్రస్తుతం ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాను. నాకు చదువు చెప్పిన గురువులు, నాయొక్క తల్లిదండ్రులు ప్రోత్సహించారు.

2025 - 26 భవిష్యత్తు ప్రణాళికపై చర్చ

బీర్కూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహిళా శక్తి సంబరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బీర్కూర్ మండల కేంద్రంలో మహిళలు ముగ్గులు వేసి సంబరాలు జరుపుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతి గురించి చర్చించారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రణాళికలు రూపొందించారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీయూ వీసీ యాదగిరి రావు

టీయూలో రక్తదాన శిబిరం ప్రారంభం

డిచ్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ వర్సిటీ శాఖ ఆధ్వర్యంలో టీయూలో వీసీ యాదగిరి రావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఏబీవీపీ కేవలం ఉద్యమాలు మాత్రమే కాదు సామాజిక సేవ కూడా చేస్తుందన్నారు. రక్తం కొరత ఉన్నవారికి ఈ శిబిరాలు ఎంతో దోహదం చేస్తుందని నిర్వాహకులను వీసీ అభినందించారు. ఇందూరు ప్రధాన వక్తగా రెంజర్ల నరేశ్ పాల్గొని మాట్లాడారు. జాతీయ వాద స్ఫూర్తితో కేవలం ఆందోళనాత్మక కార్యక్రమాలే కాదు.. సమాజంలో నిర్మాణత్మక పాత్ర పోషిస్తూ ఎక్కడైన విద్యార్థికి ఆపద వచ్చిన వెన్నుదన్నుగా నిలుస్తున్నామన్నారు. ఏబీవీపీ ఇప్పటి వరకు రక్తదాన శిబిరాలు, ఫ్రీ కోచింగ్ సెంటర్, పుస్తకాల పంపిణీ, పర్యావరణ సంరక్షణ, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ మెంబర్ అమృత్‌చారి, వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షుడు అనిల్, నాయకులు నవీన్, సమీర్, పృథ్వి, అక్షయ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గద్దె కూల్చివేసిన వారిని శిక్షించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంఆర్‌పీఎస్ జెండా గద్దెను కూల్చివేసిన అఘంతకులను వెంటనే శిక్షించాలని నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు కనకప్రమోద్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కనకప్రమోద్ మాట్లాడుతూ.. దిమ్మె నిర్మాణం కోసం కమిషనర్‌ను అనుమతి తీసుకోవడం జరిగిందన్నారు. అధికారులు దిమ్మె కట్టుకోండని తెలిపి రాత్రికి రాత్రి దిమ్మె కూల్చివేయడం జరిగిందన్నారు. ఈ అఘంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు సుజాత సూర్యవంశీ, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇంచార్జిలు స్వామి, ఇరుగు పైడిమాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి నాగం రాజేష్, ఉపాధ్యక్షుడు రొడ్డ ప్రవీణ్, ఆకారం రమేష్, మారుతి, శ్యామ్, యమున, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన 7 కుట్టు మిషన్లను బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం తెలంగాణ మహిళలను కోటి మందిని కోటీశ్వరులుగా చేయడమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళ స్వయం సహాయక సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలు ఇచ్చి సోలార్ ప్లాంట్లను ఇన్‌స్టాల్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రభుత్వానికే అద్దె ఇవ్వాలనే నిర్ణయం తీసుకుందన్నారు. మహిళలను మంచి వ్యాపారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, వివిధ మండలాల తహశీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1కిలో 435 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వప్న తెలిపారు. పట్టణంలోని అర్సపల్లి, ఎల్లమ్మకుంట, అసద్‌బాబానగర్ ప్రాంతాల్లో విస్తృతమైన దాడులు నిర్వహించగా ఎండు గంజాయి అమ్ముతున్న షేక్ పర్వేజ్, మాదవ్, నజియాబేగంలను అరెస్టు చేసి విచారించగా వారి వద్ద 1 కేజీ 435 గ్రాముల ఎండు గంజాయి దొరికిందని, 2 బైకులు, 2 మొబైలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ రాజన్న, నారాయణరెడ్డి, కానిస్టేబుల్ భోజన్న, హమీద్, శివ, సాయి, విష్ణు, అవినాష్, మంజుల, ఎస్సై నర్సింహాచారి, రాంకుమార్‌లు ఉన్నారు.

పోలీసు స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్ అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ యువకుడు ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన నగరంలో కలకలం సృష్టించింది. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన మహమ్మద్ జీషాన్‌ను 6వ టౌన్ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న కేసులో సారంగపూర్ వద్ద అదుపులోకి తీసుకోగా గత రెండు రోజులుగా రిమాండ్‌కు తరలించడం లేదనే కారణంతో పోలీస్ స్టేషన్‌లోని బాత్‌రూమ్‌లో ఉన్న ఫినాయిల్ తాగినట్లు తెలుస్తుంది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అతడిని నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అతడు కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు తెలుస్తుంది. అరెస్టు చేసి మూడురోజులైనా రిమాండ్‌కు తరలించకపోవడంతో జీషాన్ ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. కాగా, ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

బర్సత్ అమీర్ గ్యాంగ్ సభ్యుల అరెస్టు

నిజామాబాద్ అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గత నెల 7వ తేదీ నగరంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ షేక్ షారూఖ్‌పై దాడి చేసి పరారీలో ఉన్న బర్సత్ అమీర్ అనే రౌడీ షీటర్ గ్యాంగ్ సభ్యులను బుధవారం అరెస్టు చేసినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఆ కేసులో ఏ-2గా ఉన్న మహమ్మద్ శైక్ వాసిన్, ఏ-4గా ఉన్న ఎస్‌డీ ముదస్సీర్, ఏ-11గా ఉన్న షేక్ సుల్తాన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో హమల్‌వాడి, నాందేవ్‌వాడ, శ్రద్ధానంద్‌గంజ్, మార్కెట్ యార్డు, ప్రభాస్‌టాకీస్, నిజాంకాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి 5.30 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి,జూలై 9 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవ కార్యక్రమాన్ని రెట్టింపు ఉత్సాహంతో విజయవంతం చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం డిచ్‌పల్లి జాతీయ రహదారి పక్కన గల సీఎంసీ మెడికల్ కళాశాల ఆవరణలో అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వన మహోత్సవంలో 18కోట్ల మొక్కలు నాటుతుండగా, జిల్లాలో 51లక్షలు మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిదన్నారు. ప్రతి అధికారి మొక్కల పెంపకం పట్ల ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. అన్ని గ్రామాల్లో కార్యదర్శులు మొక్కల పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నరని గ్రామీణ ప్రజలు పంచాయతీ కార్యాలయాల వద్దకావల్సిన మొక్కలు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : అదనపు కలెక్టర్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. హైదరాబాద్, డిల్లీ లాంటి ప్రాంతాలు పచ్చదనం లేకా కాంక్రీట్ జంగల్‌గా మారాయని ఆ పరిస్థితి గ్రామాలకు రావద్దంటే తప్పకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. అనంతరం సీఎంసీ ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ యోహన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాన్ని కూలేశ్వరంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే..

డిచ్‌పల్లి: లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరంగా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కుతుందని, గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ కుప్పకూల్చినా 18నెలల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం డిచ్‌పల్లి సీఎంసీ మెడికల్ కళాశాలలో మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కుమ్మక్కు రాజకీయలు చేస్తున్నరని దమ్ముంటే అవినీతి మయంలో కూరుకుపోయిన బీఆర్ఎస్ నాయకులపై సీబీఐ విచారణ చేయించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ ప్రతినిధులు, అమృతపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, వాసుబాబు, ఇమ్మడి గోపి, మునిపల్లి సాయిరెడ్డి, పోలసాని శ్రీనివాస్, దేవరాజు, పాల్గొన్నారు.



దుప్పట్లు, చీరలను అందజేస్తున్న దృశ్యం

మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా దుప్పట్ల పంపిణీ

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీతక్క జన్మదినం సందర్భంగా సదన్ శక్తి సదర్ హోమ్ ఆధ్వర్యంలో మహిళలకు జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌లోగల సదన్ శక్తి సదర్ హోమ్‌లో రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సదర్ హోమ్‌లోని మహిళలకు దుప్పట్లను, చీర, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సదర్ హోమ్ అడ్వైజర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ 2005 నుంచి అనాధ మహిళల కోసం ఈ హోమ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదర్ హోం అడ్వైజర్ నాగేశ్వర్‌రావు, అధ్యక్షుడు ఎండీ చౌదరి, లీగల్ అడ్వైజర్ మురళీధర్, మెంబర్‌లు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మనగర్ కాలనీ పరిశీలన



అమ్మ వెంచర్‌ను పరిశీలించిన దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అమ్మనగర్ కాలనీని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. బుధవారం అమ్మనగర్ కాలనీలో తిరుగుతూ పలు సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు ఇరువైపులా డివైడర్ మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలను, ముళ్ల పొదళ్లను పరిశీలించి వెంటనే వీటిని తీసివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. బ్రిడ్జికి బీటీ లింక్ రోడ్డును త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. వీధిలైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలోగల కుక్కల బెడదను నివారిస్తామన్నారు. మూడున్నర ఎకరాలు గల పార్కును అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మనగర్ సొసైటీ అధ్యక్షుడు రెంజర్ల నరేష్, ఎండల కిషన్, బొబ్బిలి కిషన్, మాడవేడి వినోద్‌కుమార్, మహేందర్, న్యాలం రవి, మధుసూదన్, పంచరెడ్డి ఎర్రన్న, ప్రవీణ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఇందల్వాయి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మంగళి శ్రావణ్ ఆసుపత్రి అత్యవసర ఖర్చుల నిమిత్తం లక్షా 20వేల రూపాయల ఎల్‌వోసీ చెక్కును రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. ఆపదలో ఉన్న సమయంలో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఎల్‌వోసి అందజేసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డికి మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి

రేషన్ దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి

ఎడపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల నుండి కొత్త రేషన్ కార్డులకు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల నమోదుకు, పేర్ల తొలగింపునకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులకు మంజూరు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుదవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన భూ భారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు ఎన్ని వచ్చాయో తహసీల్దార్ దత్తాత్రిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దత్తాత్రి, మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ తదితరులు ఉన్నారు.

'ఈవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నిజామాబాద్ కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కార్యనిర్వాహణ అధికారి రమాదేవిపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారులు, సిబ్బంది డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్ గుప్త మాట్లాడుతూ ప్రభుత్వం కార్యనిర్వాహణ అధికారిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇలాంటి దాడులు జరుగకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల, కార్యనిర్వాహణ అధికారి వేణు, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు విడుదల

నిజామాబాద్ అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 545 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న 2730 మంది మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలల వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంబంధిత గ్రామ పంచాయతీ టీజీబీపాస్ ఖాతాలలో జమ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలు ప్రభుత్వం మంజూరు చేసిందని మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వెంటనే సంబంధిత మల్టీపర్పస్ వర్కర్ల వ్యక్తిగత ఖాతాలలో వేతనాలు జమ చేయాలని ఆయన సూచించారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని టీఏఎంఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మినిస్ట్రియల్ ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఫోరం రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు శ్రీనివాస్, టీఎన్‌జీవోస్ సహ అధ్యక్షుడు చిట్టినారాయణరెడ్డి పాల్గొన్నారు.

టీయూలో జాబ్‌మేళా

డిచ్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హెటిరో డ్రగ్స్ హైదరాబాద్ కంపనీ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. దీనిలో తెలంగాణ వర్సిటీ, సౌత్ క్యాంపస్ భిక్కనురు, గిరిరాజ్ కళాశాల, అనుబంధ కళాశాల విద్యార్థులు 100మందికి పైగా ఈ ప్లేస్‌మెంట్‌లో పాల్గొన్నారని విభాగాధిపతి డా.సాయిలు తెలిపారు. 54 మంది రాత పరీక్షలలో ఎంపికయ్యారని, వారందరికీ ఇంటర్వ్యూ నిర్వహించారని ఎంపికైన విద్యార్థుల జాబితా రెండు రోజుల్లో మెయిల్ ద్వారా సమాచారం అందిస్తారని సాయిలు తెలిపారు. ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని వీసీ యాదగిరి రావు సందర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.నాగరాజు, డా.బాలకిషన్, నాగరాజు, కాంట్రాక్టు అధ్యాపకులు గంగాకిషన్, సురేశ్, రాజేశ్వరి, నాగేశ్వరరావు, సునీత, డానియల్, నాగేంద్ర బాబు, గంగాధర్ , రఘువీర్ లు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ ఏఎస్సై భార్య దుర్మరణం

నిజామాబాద్ అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లొస్తూ ఏఎస్సై భార్య దుర్మరణం పాలయ్యారు. నగరంలో నివాసం ఉండే ఇంటెలిజెన్స్ ఏఎస్సై భీమ్‌రావు సతీమణి మాక్లూర్ భవాని (58) బుధవారం తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై బాసరకు వెళ్లారు. అమ్మవారి దర్శనం అనంతరం తిరిగొస్తూ ప్రమాదానికి గురయ్యారు. కంఠేశ్వర్ బైపాస్ నుంచి వస్తుండగా వీరి వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దీంతో భవాని కుమారుడు ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో వాహనంలో కొంగు చిక్కుకోవడంతో భవాని అదుపుతప్పి కిందపడిపోయింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

విధులు బహిష్కరించి పవర్‌హౌజ్‌లో నిరసన

సుభాష్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉద్యోగులందరూ కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ రాష్ట్ర కార్యచరణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జిల్లా జేఏసీ ఛైర్మన్ రఘునందన్, కో ఛైర్మన్ పి.గంగాధర్, జేఏసీ కన్వీనర్ బాలేష్‌కుమార్, కోకన్వీనర్ రాజశేఖర్, పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు

(ఐదో పేజీ తరువాయి)

ధరలను పెంచుతూ ప్రజలను దోచుకుంటున్నారని ప్రశ్నించే వారిపై దేశ ద్రోహులుగా ముద్ర వేస్తూ ప్రజాస్వామ్య వాదులను నిర్బంధిస్తున్నారని అన్నారు. 70 ఏళ్ల కాలంలో మోదీ ప్రభుత్వ విధానాలను గత ప్రభుత్వాలకంటే అత్యంత వ్యతిరేకంగా కొనసాగిస్తున్నారని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను పనిగంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు 26వేల జీతం, కనీస పెన్షన్ 9వేలు అమలు చేయాలని సంఘటిత, అసంఘటిత కార్మిక ఉద్యోగ సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజాతీర్పును ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్రాములు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాలకృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, కార్మిక జేఏసీ నాయకుడు వెంకన్న, రాజేశ్వర్, కిషన్, కిరణ్, రవి, శివకుమార్, స్వర్ణ, రేణుక, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్‌కెఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఐటీఐ మైదానం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పెద్దబజార్, మల్టీప్లెక్స్ చౌరస్తా, కుమార్‌గల్లి మీదుగా గాంధీచౌక్ వరకు సాగింది. బైక్ ర్యాలీలో నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. గాంధీచౌక్ వద్ద నిర్వహించిన సభకు జిల్లా కన్వీనర్ కంజర భూమయ్య హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 8గంటల పని చేయడానికి కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో అనగదొక్కుతుందని అన్నారు. కార్మిక సంఘం నిర్మాణం చేసుకునే హక్కులతో పాటు అనేక హక్కులను మోదీ సర్కార్ అధికారంలోకి రాగానే వాటిని తుంగలోకి తొక్కిందన్నారు. దేశవ్యాప్తంగా జెండాలకు అతీతంగా సమ్మెలో కార్మిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని అన్నారు. మోదీ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను కార్మికులను కష్టాల్లో నెట్టుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దేవారం, గంగాధర్, సురేష్, గంగారాం, బాజన్న, బాబన్న, కిషన్, శివాజీరాజ్, సాయిలు పాల్గొన్నారు.

బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో నిరసనలు..

బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎల్‌టీయూ నాయకులు నిరసన తెలిపారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్, ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఇతర నాయకులతో కలిసి నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో ముందు చూపుతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన కార్మిక రక్షణ చట్టాలను మోదీ నాయకత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడిదారుల లాభం కోసం రద్దు చేసిందని అన్నారు. మోదీ ప్రభుత్వం చెప్పేది సబ్‌కా వికాస్ సబ్‌కా సాత్ కానీ ఆయన ప్రభుత్వం అనుసరిస్తుంది మాత్రం అంబాని, ఆదాని ఇతర విదేశీ కార్పొరేట్ కంపెనీల వికసించే విధానం అని అన్నారు. భారత బహుజన కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు అందించి కార్మికులను బానిసలుగా మార్చేందుకే లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది బీడీ ఉపాధి కార్మికులు ఉపాధి కోల్పోయే విధంగా ఆంక్షలు విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నా కార్మికులకు మాత్రం వేతనాలు పెంచడం లేదని అన్నారు. లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ లత మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆధిపత్య దోపిడి ఆర్థిక విధానాల వల్ల బహుజన శ్రామిక, మహిళ శ్రమదోపిడితో పాటు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి జిల్లా కోర్టు మీదుగా రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, రైల్వేస్టేషన్ వరకు మానవహారంగా ధర్నాచౌక్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బీఎల్‌టీయూ నాయకులు రాహుల్, మురళి, గంగాశంకర్, డ్రైవర్ యూనియన్ నాయకుడు నవీన్, సాయిలు, మోహన్‌గౌడ్, శ్రీశైలం, రాజేశ్వర్, శ్రీనివాస్, వసంత్‌కుమార్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

డిచ్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ప్రొ.రవీందర్‌రెడ్డి, ఆధ్వర్యంలో యూనిట్ 1,4 వలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరి రావు మాట్లాడుతూ... ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా చేయడంపై విద్యార్థులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ లు స్రవంతి, డా.స్వప్న పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

డిచ్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర వసతి గృహంలో బుధవారం ఇందల్వాయి పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.క్రిస్టినా మాట్లాడుతూ.. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. శుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేశ్‌గౌడ్, ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, పర్యవేక్షకులు అక్బర్, మల్లిక, సుల్తాన, మల్లేశ్, సుజాత, స్వర్ణ, ఆశాలు లలిత, స్వర్ణ, మమత, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.210	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.220	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,400	రూ.89,800	రూ.1100

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మెట్రో ఇన్ డినో (హిందీ) (10.10)
: సోలో బాయ్ (1.35)
: తమ్ముడు (4.25, 7.35, 10.45)
స్క్రీన్-2 : షో టైమ్ (10.05)
: కుబేరా (12.30, 4.10, 7.50, 10.40)
స్క్రీన్-3 : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (10.10, 1.00)
: కన్నప్ప (3.50, 10.45)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (7.30)
స్క్రీన్-4 : ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (10.20)
: 3బిహెచ్‌కె (1.35, 7.55)
: సితారే జమీన్ పర్ (హిందీ) (4.30)
: మెట్రో ఇన్ డినో (హిందీ) (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తమ్ముడు (1.40, 7.20, 10.20)
: 3బిహెచ్‌కె (4.35)
స్క్రీన్-2 : జురాసిక్ వరల్డ్ (తెలుగు 3డి) (11.00, 4.40, 10.30)
: కుబేరా (1.30, 7.20)
స్క్రీన్-3 : 3బిహెచ్‌కె (10.45, 7.40)
: కన్నప్ప (1.25, 10.35)
: కుబేరా (4.30)

దేవి : కన్నప్ప (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కుబేరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తమ్ముడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్